మైనర్‌ల డ్రైవింగ్‌తో తరచూ ప్రమాదాలు

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో ఇటీవల కాలంలో ప్రధాన రహదారుల్లో ద్విచక్ర వాహనాలను మైనర్లు నడుపుతుండడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. వేసవి సెలవులు కావడంతో మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలపై నలుగురేసి చొప్పున ఎక్కి విచ్చలవిడిగా డ్రైవింగ్‌లు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజానీకం కోరుకుతున్నారు.

కలెక్టరేట్‌లో ఏం జరుగుతోంది..?



- కలెక్టర్‌కు సమాంతర పాలనే లక్ష్యమా..!
- కలెక్టర్‌కు తెలియకుండా సమావేశాలు ఏర్పాటు
- ఆ అధికారులకు మంత్రి అండదండలే కారణమా..!
- కలెక్టర్ ఆగ్రహం వెనుక ఆంతర్యమేంటి..?

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాకు బాస్ కలెక్టర్.. ఇది అందరికీ తెలిసిందే. కానీ కలెక్టర్‌కు సమాంతర పాలన ఏర్పాటు చేయవచ్చా..? కలెక్టర్‌కు తెలియకుండా ఆయనకు ఎదురుగానే సమావేశాలను, వివిధ రకాల కార్యక్రమాలను ఏర్పాటు చేసే అధికారం ఆయా శాఖల అధికారులకు వుందా అంటే విజయనగరం కలెక్టరేట్‌లో జరుగుతున్న పలు కార్యక్రమాలను చూస్తే అవుననే అనుమానం వస్తోంది. కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు సమాంతర పాలన నడుస్తోందా అంటే ఇక్కడి విషయాలు అవుననే చెబుతున్నాయి. ఒక డైనమిక్ కలెక్టర్ పాలనలో ఇటువంటి సంఘటనలు అధికార పాలక వర్గాలలో ఆలోచన రేకెత్తిస్తున్నాయి. అసలు కలెక్టరేట్‌లో ఏం జరుగుతోంది. కలెక్టర్‌పై ఇంత స్థాయిలో కుట్ర జరగడానికి కారణాలు ఏంటి..? ఎవరి అండదండలతో వివిధ శాఖల అధికారులు కలెక్టర్‌ను లెక్క చేయడం లేదు. ఇప్పుడు కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండలాలలో ఇదే చర్చగా జరుగుతోంది.

అసలేం జరిగిందంటే...

ఇటీవల రెండు రోజులక్రితం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వికలాంగులకు వివిధ రకాల పరికరాలను అందజేసే కార్యక్రమం జరిగింది. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. కానీ ఈ కార్యక్రమం గురించి చాంబర్‌లో ఉన్న కలెక్టర్‌కు తెలియకపోవడం విశేషం. మంత్రి గుర్తు చేయడంతో నాలిక కరుచుకున్న ఏపీసీ వెంటనే కలెక్టర్ వద్దకు పరుగులు తీసి రమ్మని పిలిచారు. పిలవకపోవడం ఒక అవమానమైతే.. అప్పటికప్పుడు పిలవడం మరో అవమానంగా కలెక్టర్ భావించారు. అదిలా ఉంటే అదే రోజు వ్యవసాయ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌ను పిలవలేదు. ఇది మరో అవమానం కలెక్టర్ రాకుండా నేనెందుకు అని ఈసమావేశానికి మంత్రి కూడా హాజరుకాలేదు. ఈవిషయం అక్కడ ఇక్కడ చేరి చివరకు జిల్లా అంతా పాకింది. కలెక్టర్‌ను కాదని కొందరు అధికారులు సమాంతర పాలన చేస్తున్నారని గుసగుసలాడుకుంటున్నారు.

ఆ అధికారుల శెలవు వెనుక కారణమేంటి..?

రెవెన్యూలో కీలకంగా ఉన్న జిల్లా రెవెన్యూ అధికారి, అలాగే డివిజనల్ రెవెన్యూ అధికారితో పాటు విజయనగరం మండల తహశీల్దార్‌లు వివిధ కారణాలతో శెలవులు పెట్టి వెళ్లారు. ఇది అదునుగా కలెక్టర్ వ్యతిరేక వర్గీయులు కొందరు వీరి శెలవులకు కారణం కలెక్టర్ వేదింపులే అని ప్రచారం చేసారు. ఇది కాస్తా ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిపోయింది. వాళ్ళు ఏఏకారణాలతో శెలవులు పెట్టారో చివరకు కలెక్టర్ స్వయంగా అధికారుల సమావేశంలో చెప్పుకోవలసిన పరిస్థితి వచ్చింది.

ఎవరి అండదండలతో వ్యతిరేక వర్గం రెచ్చిపోతుందో..?

సాధారణంగా కలెక్టర్‌ను కాదని ఏ అధికారి ఎదరు చెప్పలేని పరిస్థితి ఉంటుంది. కానీ కొన్ని శాఖల అధికారులు మాత్రం రెచ్చిపోవడం వెనుక కీలకమైన అధికార పార్టీ నేతల అండదండలే కారణమని ప్రచారం ఉంది. ఓ మంత్రి స్వయంగా కొందరి అధికారులకు కలెక్టరేట్‌లో పోస్టింగ్ వేయించారని చెబుతారు. ఇవన్నీ గుర్తించిన కలెక్టర్ సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులను దాదాపు ఉతికి ఆరేశారు. తనకు తెలియకుండా ఏ ఒక్క నాయకున్ని కలువడానికి వీల్లేదని ఆదేశించారు. అలాగే ఆడిటోరియంలో కార్యక్రమాలకు తనను గానీ జెసిని గానీ అనుమతి తీసుకోవాల్సిందేనని తెలిపారు. తనపై ఆరోపనలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నడూ లేనిది కలెక్టర్ ఒక్కసారిగా హెచ్చరికలు జారీ చేయడంతో అధికారులలో వణుకు పుట్టిందనే చెప్పవచ్చు. ప్రస్తుతం కలెక్టరేట్ విషయం ఎంతవరకు దారి తీస్తుందోనని అందరిలో అయోమయంగా ఉంది.

తారురోడ్డు పనులకు మోక్షం కలిగేనా...?

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న టెక్కలవలస జంక్షన్ నుంచి కాగాం, పాములవలస, మోదుగవలస, ఎంబి వలస తదితర గ్రామాలకు వెళ్లే బీటీ తారురోడ్డుపై ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు గుంతలు గుతలుగా బీటలు బారి మెటల్ తేలడం వలన వాహనాలు నడిపేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న టెక్కలవలస కూడలి వద్ద చినుకు పడితే చాలు మోకాలి లోతు నీరు నిల్వ ఉండడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. రోడ్డు రవాణా జిల్లా స్థాయి అధికారులు దృష్టి పెట్టి వాహనదారుల ప్రయాణానికి అంతరాయం లేకుండా తారు రోడ్డు పనులు త్వరతగతిన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

బొబ్బిలి గ్రోత్ సెంటర్ అభివృద్ధిపై దృష్టిసారించండి: సుజయ్ కృష్ణ

విశాలాంధ్ర - బొబ్బిలి: వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి టి.జి.భరత్‌తో మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఆర్.వి.సుజయ్ కృష్ణ రంగారావు విజయవాడలో భేటీ అయ్యారు. విజయనగరం జిల్లాలో పరిశ్రమల స్థితిగతులను వివరించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను సుజయ్ కృష్ణ వివరించారు. ప్రధానంగా బొబ్బిలి గ్రోత్ సెంటర్ అభివృద్ధిపై చర్చించారు. గతంలో భూములు పొంది కాలయాపన చేస్తున్న యాజమాన్యాలను గుర్తించి వారితో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు స్థాపించకుండా విలువైన పారిశ్రామిక వాడను నిర్వీర్యం చేస్తున్నారని సదరు యాజమాన్యాలను సహించవద్దని మంత్రికి తెలిపారు. అనేక మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమలు పెట్టేందుకు తనను సంప్రదిస్తున్నారని వారికి భూములు ఇవ్వాలని మంత్రి భరత్‌ను సుజయ్ కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర - తెర్లాం: తెర్లాం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయం అధికారి సి.హెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అలాగే పిల్లలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున బహుమతులు అంద జేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ టీచర్ కే.విస్సు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టాపర్స్ బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరం పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్, మెంటాడ రోడ్డు జంక్షన్లో ట్రాఫిక్ నియంత్రణ, యాక్సిడెంట్‌లు జరగకుండా ఉండేందుకు గాను స్టాపర్స్ బోర్డులు ఏర్పాటు చేశారు. వాహనాలు స్పీడును కంట్రోల్ చేయడంలో భాగంగా మంగళవారం గజపతినగరం సిఐ జీఏవి రమణ, ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జరిమానా

విశాలాంధ్ర - రామభద్రపురం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒక వ్యక్తికి పదివేల రూపాయలు జరిమానాను సాలూరు ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి హర్షవర్ధన్ విధించారని స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు తెలిపారు. బాడంగి మండలం డొంకినవలసి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇటీవల వాహనాల తనిఖీల్లో భాగంగా రామభద్రపురంలో పట్టుపడ్డాడు. అతనిపై కేసు నమోదు చేయగా న్యాయమూర్తి రూ.10 వేలు జరిమానా విధించారన్నారు.

యోగా ఆరోగ్యానికి రక్ష

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-లక్కవరపుకోట: యోగా ఆరోగ్యానికి రక్ష అని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగాసనాలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి ఏపీ ఆదర్శ పాఠశాల వరకు అన్ని కార్యాలయాల ప్రభుత్వ ఉద్యోగులు, క్లాప్ ఉద్యోగులు, మండల స్థాయి ఉన్నతాధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డిఎంజిఎస్ ప్రసాదరావు, ఎంపీడీవో ఎస్.అప్పారావు, ఎస్సై నవీన్ పడాల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గేమ్స్ కిట్లు ఇవ్వాలి

విశాలాంధ్ర - వంగర: మగ్గూరు ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు గేమ్స్ కిట్లు ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ స్కూల్లో 29 మంది విద్యార్థులు ఉండగా కిట్లు పంపిణీ చేయలేదని అన్నారు. వంగల హైస్కూల్ పరిధిలో ఉన్నటువంటి 8 పాఠశాలలకు కిట్స్ అందజేస్తున్నారని, మగ్గూరు విద్యార్థులకు కూడా గేమ్స్ కిట్లు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయమై వంగర హైస్కూల్ హెచ్ఎం ముద్దాడ రమణమ్మను సంప్రదించగా 8 పాఠశాలలకు కిట్లు అందజేస్తున్నామని త్వరలో మగ్గూరు పాఠశాల విద్యార్థులకు కూడా అందిస్తామని వివరణ ఇచ్చారు.



వ్యవసాయం లాభసాటే చంద్రబాబు లక్ష్యం

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర - మెంటాడ: వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రైతు సంక్షేమంతోనే రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం ఇద్దనవలస గ్రామంలో రాయితీపై విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతు కన్నీళ్లు రాష్ట్రానికి చేటు అని రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. సంప్రదాయ వ్యవసాయాన్ని కొనసాగిస్తూనే సాంకేతికతను అందుకోవాలని తెలిపారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వలన నిధుల సమస్య ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో శిథిలమైన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తామన్నారు. జూన్ నెలాఖరు నాటికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులతోపాటు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర రిజర్వాయర్ అభివృద్ధికి కోటి 50 లక్షలు, గర్ల మినీ రిజర్వాయర్, ఆంధ్ర ఎడమ కాలువ పూర్తి చేయటానికి 50 లక్షలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావు, టీడీపీ మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, టిడిపి నాయకులు గెద్ద అన్నవరం, రెడ్డి ఆదినారాయణ, సర్పంచ్ రామారావు, రెడ్డి సత్యనారాయణ, ఎంపీడీవో భానుమూర్తి, మండల వ్యవసాయ అధికారి గోకుల్ కృష్ణ, ఇతర మండల స్థాయి అధికారులు, టిడిపి కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు మేలు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న 6 యూనిట్లలో నువ్వుల పంటల్లో వేసిన నవధాన్య సాగు పొలాలను డీపీఎంయు సిబ్బంది మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఏ సిబ్బందికి ఇచ్చిన టార్గెట్ మేరకు కిట్లు పంపిణీ జరిగిందా లేదా అన్నది ఆరా తీశారు. నవధాన్యాలు సాగు చేసిన పొలాలకు సాగు చేయని పొలాలకు గల తేడాలను రైతులకు వివరించారు. నువ్వుల్లో వేసిన నవధాన్య సాగు పొలాల్లో నువ్వు పంట పోయిన నవధాన్యాల సాగు పొలాలు వర్షాలకు తట్టుకోవడం జరిగిందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎంపి యూనిట్ల సిబ్బంది, ఎన్ఎఫ్ఏలు వరప్రసాద్, రమేష్, శంకర్, మాస్టర్ ట్రైనర్లు సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఇ లక్ష్మణరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం దాసన్నపేట విద్యుత్ భవనంలో యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యోగా గురువు కే.శశిభూషణరావు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ లక్ష్మీనారాయణ, ఎస్ఏఓ అప్పల నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ త్రినాథ రావు, సత్య నారాయణ, సురేష్ బాబు,మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల విత్తనాలు సాగు నేలతల్లి బాగు

విశాలాంధ్ర - సంతకవిటి/రాజాం: సంతకవిటి మండలం మామిడిపల్లి పంచాయతీ ప్రకృతి వ్యవసాయ ఇబ్బంది యూనిట్ ఇన్చార్జి పాత్రుని వెంకటరమణ నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. మామిడిపల్లి ఎస్.రంగరాయి పురం గ్రామంలో కె.గోపాల్రావు, ఆబోతుల బుచ్చయ్య 8 ఎకరాల విస్తీర్ణంలో చేస్తున్న నవధాన్యాల సాగును పరిశీలించారు. నవధాన్యాల సాగుతో అధిక దిగుబడి పొందవచ్చన్నారు.

రేషన్ పంపిణీలో అవినీతి సహించం

విశాలాంధ్ర - బాడంగి: అవినీతికి తావు లేకుండా రేషన్ షాపుల నిర్వహణ జరగాలని తహశీల్దార్ సుధాకర్ అన్నారు. నూతనంగా రేషన్ షాపుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను పర్యవేక్షణ కోసం మంగళవారం బాడంగి-1, బాడంగి-2 షాపులను పరిశీలించారు. అనంతరం అక్కడకు వచ్చిన వినియోగదారులలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికలు, కొలతలు సవ్యంగా ఉండేవిధంగా చూసుకోవాలని కోరారు.

ప్రజలకు వెన్నుపోటు పొడిచి ఇప్పుడు ధర్నాలా....?

ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

విశాలాంధ్ర - రాజాం: వైసీపీ ఐదేళ్ల కాలంలో ప్రజలకు వెన్నుపోటు పొడిచి ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు చెప్పారు. మంగళవారం రాజాంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వెన్నుపోటు గొడ్డలిపోటు పేటెంట్ జగన్మోహన్ రెడ్డిదేనని విషయం గ్రహించిన ప్రజలు ఎన్నికల్లో ఆయనకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70% హామీలు అమలు చేసి కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసం చూరగొంటోందన్నారు. కాంగ్రెస్‌ని అడ్డం పెట్టుకుని లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని ఏర్పాటు చేసారని చెప్పారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచిన పెద్ద వెన్నుపోటుదారుడు జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. జగన్ ముఠా చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. జగన్ ముఠా నాటకాలను ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

గర్భిణిల మృతిపట్ల కలెక్టర్ ఆగ్రహం

- తప్పుచేసిన వారిపై క్రిమినల్ చర్యలు తప్పవు
- ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర - విజయనగరం: వివిధ కారణాలతో ప్రసవ సమయంలో, ప్రసవానంతరం గర్భిణులు, శిశువులు మృతి చెందడం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయా సంఘటనలపై సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎంపిసి డిఎస్ఆర్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. నవంబరు 24 నుంచి మార్చి 25 వరకు జిల్లాలో సంభవించిన 4 మాతృ మరణాలు, 5 శిశు మరణాలపై ఈ సమావేశంలో చర్చించారు. మృతికి కారణాలు, సిబ్బంది లేక వైద్యుల నిర్లక్ష్యం, ఏ స్థాయిలో తప్పిదం జరిగి ఉంటుంది తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. వైద్యులను, ఐసిడిఎస్ సిబ్బందిని, ఆశా, ఏఎన్ఎంలను ప్రశ్నించారు. అన్ని రకాల రికార్డులు తమకు సమర్పించాలని ఆదేశిం చారు. కొన్ని ప్రయివేటు ఆసుపత్రుల ప్రతినిధులు సమావేశానికి రావకపోవడంపై మండిపడ్డారు. గర్భిణిలు వెంపడాపు లీలావతి, బంగారి సుధ మరణంపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించారు. కొరమ దుర్గ మృతి విషయంలో పిజి స్టార్ ఆసుపత్రికి నోటీస్ ఇవ్వాలని, అలాగే మరో మృతికి సంబంధించి, సమావేశానికి కెజిహెచ్ వైద్యులు హాజరుకాకపోవడంతో, కెజిహెచ్ సూపరింటెం డెంట్‌కు కూడా డిఓ లెటర్ రాయాలని కలెక్టర్ సూచిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది ఇస్తున్న నివేదికలు పొంతన లేకుండా పోయాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శుభశ్రీరాణి, ఘోషాసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శుభశ్రీ, డిఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, సీడీపీఓ ప్రసన్న, పలువురు వైద్యాధికారులు, ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదలు, కార్మికులకు వెన్నుపోటు పొడిచిన జగన్

ఎమ్మెల్యే అదితి గజపతి రాజు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: మెగా డీఎస్సీ అమలు చేయకపోగా, అన్న క్యాంటీన్‌లు రద్దు చేసి జగన్ మోహన్ రెడ్డి పేదలు, కార్మికులకు వెన్నుపోటు పొడిచారని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ముందుకు వెళ్తుందని అన్నారు. మొదటి నెలలోనే రూ.4 వేలు పింఛను పెంచి అమలు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లను పునః ప్రారంభించామని, విజయనగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్, మున్సిపల్ కార్యాలయం జంక్షన్, ఘోషా ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీన్‌లు ప్రారంభించామన్నారు. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నామన్నారు. దీపం-2 కింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం ద్వారా సుమారు 20 వేల కి.మీ రహదారులు బాగు చేశామన్నారు. అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిలోనే అధిక శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం మరొకటి లేదని, సంక్షేమం-అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు మాత్రమే అని అన్నారు. వెన్నుపోటు అంటూ కార్యక్రమాలు చేయడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని, వైసిపి చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

అధికార పార్టీ అక్రమాలను ఎండగట్టాలి

మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విశాలాంధ్ర - చీపురుపల్లి: అధికార కూటమి ప్రభుత్వం అక్రమాలను ఎండగట్టాలని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీని మరింత పటిష్టంగా బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం అని కోరారు. విజయనగరం జిల్లా అనుబంధ విభాగాలు అధ్యక్షులు ప్రచార విభాగం వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, సోషల్ మీడియా విభాగం వై.వాసు నాయుడు, సాంస్కృతిక విభాగం డా. బలివాడ నరేంద్ర కుమార్, ఐటీ వింగ్ అధ్యక్షులు గందవరపు హేమంత్ కుమార్, చీపురుపల్లి అసెంబ్లీ సోషల్ మీడియా కో- కన్వీనర్ ఎల్.ప్రబాత్ కుమార్, విజయనగరం మాజీ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర వైసీపీ పి.ఏ.సి మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు)ని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 4వ తేదీన జరగబోయే వెన్నుపోటు దినం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జిపురపు విజయ్, మహంతి మురళి, వెంకీ, గణేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాన్ని వెన్నుపోటు దినం ద్వారా వివరిద్దాం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలన ద్వారా ప్రజలను ఎలా మోసం చేసింది.. ప్రజలను ఏ విధంగా వెన్నుపోటు పొడిచిందో ఈనెల 4న నిర్వహించే వెన్నుపోటు దినం ద్వారా వివరిద్దామని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. 4వ తేదీన ఎస్.కోట ఆకులు డిపో వద్ద నియోజకవర్గ శ్రేణులతో ఉదయం 9 గంటలకు ర్యాలీగా మండల ఎమ్మార్వో కార్యాలయంకు చేరుకొని ఎమ్మార్వోకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. వైసీపీ నాయకులు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఈ ప్రభుత్వంపై తమ నిరసన గళం వినిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పెనిశెట్టి రమణ, వాకాడ రాంబాబు, మోపాడ కుమార్, పదాల ధర్మారావు, షేక్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి శోభాయాత్ర

విశాలాంధ్ర – శృంగవరపుకోట: దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్యగిరి క్షేత్రం దిగువ భాగంలో ఎంతో సుందరంగా నిర్మితమవుతున్న పుణ్య తిరుమలగిరి ఆలయం ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మండల కేంద్రమైన ఎస్.కోట సమీపంలో ఉన్న పుణ్యగిరి దేవస్థానం దిగువన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, దార గంగమ్మ ఆలయ అనువంశిక ధర్మకర్త మోపాడ గౌరీ నాయుడు ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యోగాలో కనీసం వెయ్యి మంది పాల్గొనేలా చూడాలి

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర – విజయనగరం కంటోన్మెంట్: యోగాంధ్రలో జిల్లా అధికారులందరికీ లక్ష్యాలు నిర్దేశించినట్లు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. పర్యాటక ప్రాంతాలైన చింతపల్లిలో ఈ నెల 6న, రామతీర్థం 12న, తాటిపూడిలో 19న నిర్వహించే యోగా కార్యక్రమానికి ప్రతిఒక్క అధికారి కనీసం 100 మందిని సిద్ధం చేయాలన్నారు. అలాగే 10న ఎస్.కోటలో నిర్వహించే థీమ్ యోగాకు కనీసం 5 వేల మందిని సిద్ధం చేయాలని తెలిపారు. మంగళవారం జే.సి తన ఛాంబర్‌లో యోగా జిల్లా కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జే.సి సిటిజెన్ ట్రైనింగ్ ఈ రోజు నుండి ప్రారంబం అయ్యిందని, ఒక్కో సచివాలయ పరిధిలో 3 బాచ్ లలో 150 మందికి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. స్థానికులకే ప్రాధాన్యత నివ్వాలని, ప్రధానంగా యువతనే మోటివేట్ చేయాలనీ తెలిపారు. ఉదయం 6.30 కే వేదికల వద్ద హాజరయ్యేలా చూడాలన్నారు. టీ షర్ట్స్, యోగ మాట్స్ కూడా సరఫరా చేయాలని, పి.ఏ. సిస్టం సరిగ్గా పని చేసేలా చూడాలని తెలిపారు. ఈ నెల 21 న ప్రధాన మంత్రి కార్యక్రమానికి భీమిలి బీచ్ లో హాజరు కావడానికి జిల్లా నుండి లక్ష మందిని మొబలైజ్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఏ పి.డి కళ్యాణ చక్రవర్తి, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ సత్యనారాయణ, రవాణా ఉప కమీషనర్ ఫణి కుమార్, జిల్లా పంచాయతి అధికారి వెంకటేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ ఇంచార్జ్ డిడి వెంకటేశ్వరరావు, మెప్మ పి.డి, డి.ఎస్.ఓ, హౌసింగ్ పి.డి, డ్వామ, డి.ఈ.ఓ, వయోజన విద్య, జి.ఎస్.డబ్లు., జిల్లా పర్యాటక అధికారి కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగాంధ్ర ర్యాలీ

విశాలాంధ్ర – శృంగవరపుకోట: మండల కేంద్రమైన ఎస్ కోటలో మంగళవారం ఉదయం పలు శాఖల అధికారులు, యోగా సాధకులు ఆధ్వర్యంలో యోగా ఆంధ్ర ర్యాలీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఎంపీడీవో సతీష్, ఎమ్మార్వో అరుణ్ కుమారి పలు శాఖల అధికారులు సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎస్.కోట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా యోగా వలన కలిగే లాభాలను నినాదాలు రూపంలో వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పొట్నూరు శ్రీరాములు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, యోగ సాధకులు ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ ద్వారా క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర – విజయనగరం కంటోన్మెంట్: విజయనగరం జిల్లాలో ఉద్యాన శాఖ ద్వారా క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం అమలు చేయనుందని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లాలో ముఖ్య పంటలైన మామిడి, కొబ్బరి, అరటి, కోకో పంటలలో అధిక దిగుబడి సాధించే దిశగా ఉద్యాన శాఖ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం అమలు చేయనుందని, దీనిలో భాగంగా ఫాం గేట్ విలువ 100 కోట్లు కలిగిన పంటలలో ప్రీ ప్రొడక్షన్, ప్రొడక్షన్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్మెంట్, మార్కెటింగ్, బ్రాండింగ్ తదితర అంశాలలో ప్రస్తుతం అనుసరిస్తున్న సాంప్రదాయ పద్ధతులకు సాంకేతికతను జోడించి పంట దిగుబడి, నాణ్యతను పెంచే దిశగా రైతులకు తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. ఈ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంను వివిధ చట్టపరమైన అనుమతులు కలిగిన సంస్థలు (FPOs / FPCs/ కో –ఆపరేటివ్ సొసైటీస్) ద్వారా అమలు చేయనుంది కావున ఆసక్తి కలిగిన సంస్థలు https://www.nhb.gov.in/online Appli cation/ online_ Registration_intern website నందు దరఖాస్తు చేసుకోవల సినదిగా కోరారు. వివరాలకు 79950 86762కు సంప్రదించాలని తెలిపారు.

మంచినీటి సరఫరా బంద్

విశాలాంధ్ర – గజపతినగరం: గజపతినగరం పట్టణంలోని బూరి ల వీధిలో మెయిన్ పైప్ లైన్ రిపేర్లు చేస్తున్నందున బుధ, గురువారాలు మంచినీటి సరఫరా ఉండదని గ్రామపంచాయతీ ఈవో జనార్ధన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు.

మలేరియా అంతం - మనతోనే సాధ్యం

విశాలాంధ్ర – వేపాడ: సీజనల్ వ్యాధులలో భాగంగా వచ్చే మలేరియా వ్యాధి అంతం మనతోనే సాధ్యమని వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వేణు అన్నారు.మంగళవారం వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా నివారణ మాతోత్సవాల సందర్భంగా మలేరియాపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.వేణు మాట్లాడుతూ ఎవరికైనా చలి జ్వరం వచ్చినట్లయితే రక్త పరీక్ష చేయించుకొని, మలేరియా అవునా కాదా అని నిర్ధారన చేయించుకున్నచో దాన్ని అనుసరించి చికిత్సలు అందజేస్తామన్నారు. మలేరియా నివారణ మన అందరి బాధ్యత అని ప్రతి శుక్రవారం వీటిపై గ్రామాల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ఏ.సంజన, హెల్త్ సూపర్వైజర్ వివి రమణ, ఎం.ఎల్ హెచ్‌పిఓ, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనతో సంబరాలు

విశాలాంధ్ర – గజపతినగరం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం అయిన సందర్భంగా ఘనంగా సంబరాలు చేసుకుందామని మాజీ మంత్రి, జనసేన పిఏసి సభ్యురాలు పడాల అరుణ మంగళవారం అన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు త్రిలోధకాలు ఇచ్చేలా సాగిన గత వైసిపి పాలనను అంతమొందించి రాష్ట్రాన్ని అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు ప్రగతి ప్రధాన నడివించే ఓటమి ప్రభుత్వం ఏకాదశి స్థాయి విజయం చేసుకొని నేటికీ సంవత్సరం పూర్తయిన సందర్భంలో ఘనంగా వేడుకలు చేసుకొని ప్రపంచానికి తెలుపుదామని అన్నారు. నేడు ఉదయం సంక్రాంతి నాడు ముంగిళ్లను నింపునట్లు రంగవల్లులతో అందంగా తీర్చిదిద్ది సాయంత్రం దీపావళిని గుర్తు చేసుకునేలా దీపాల వెలుగులతో నింపుదామని మన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలువు ఇచ్చిన ఈ కార్యక్రమానికి విజయవంతం చేయదానికి ఈ ప్రక్రియను అనుసరించడం జరిగిందని కావున జనసైనికులు వీర మహిళలు నేడు ప్రభుత్వ కళాశాల మైదానంలో జరిగే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన గజపతినగరం మండల అధ్యక్షులు మునకాల జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారికి పుష్పాలంకరణ

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి చదురుగుడికి మంగళవారం కావడంతో భక్తులు పోటెత్తారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన ఆలయ కార్య నిర్వహణ అధికారి కేఎన్‌విడివి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవాలయముకు విచ్చేసిన భక్తులకు అర్చకులు ఏడిద వెంకటరమణ, పూజారి బంటుపల్లి వెంకటరావు, ధనుంజయ పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుడా ఆలయ అధికారులు ప్రతిష్ఠ చర్యలు చేపట్టారు . సాయంత్రం పంచహారతిసేవ నిర్వహించారు.వనంగుడిలో కొలువైన శ్రీ పైడితల్లి అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

రసాబసగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర – విజయనగరం రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాబసగా మారింది. ముఖ్యంగా డిఆర్డిఏ రివ్యూ కార్యక్రమంలో భాగంగా జొన్నవలస, సారిక, తదితర గ్రామాలకు సంబంధించిన వివో, వి ఏ ఓ ల వాళ్ల మార్పు విషయంలో గట్టి చర్చ జరిగింది. ఒకానొక దశలో తెలుగుదేశం పార్టీ సభ్యులంతా పోడియం దగ్గరకు చేరుకున్నారు. ఈ సమయంలో మామిడి అప్పలనాయుడు తనకు అన్నీ తెలుసునని తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సభ్యులంతా ఓటింగ్‌కు పట్టుబట్టారు. దీంతో ఎంపీపీ మౌనం పాటించారు.

వెన్నుపోటు - గొడ్డలివేటు పేటెంట్ జగన్ రెడ్డిదే

ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి

విశాలాంధ్ర – వేపాడ: వెన్నుపోటుదారుడు జగన్ రెడ్డి వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి మండిపడ్డారు. మంగళవారం లక్కవరపుకోటలో తన పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకొని లక్ష కోట్ల దోచుకొని అదే పార్టీని వెన్నుపోటు పొడిచిన ఘనత జగన్మోహన్ రెడ్డికే సాధ్యం అన్నారు. జింకా వెంకట నరసయ్య అనే వ్యక్తి జగన్ రెడ్డి తాత రాజారెడ్డికి కొంత భాగస్వామి కల్పిస్తే కృతజ్ఞత లేకుండా అతన్ని హత్య చేసి మైన్‌ని కబ్జా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆస్తి కోసం చెల్లిని తల్లిని ఇంటి నుంచి గెంటేసి,కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచారన్నారు. పెంచిన బాబాయిని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ రక్తసంబంధానికి వెన్నుపోటు పొడిచాడని, అలాగే మద్యపానం నిషేధం, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల రద్దు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచాడని ఎద్దేవ చేశారు.

ఎస్.సి.కార్పొరేషన్ ఇ.డి.కి సాంఘిక సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు

పదోన్నతిపై అనకాపల్లి వెళ్లిన ప్రస్తుత అధికారి రామానందం

విశాలాంధ్ర – విజయనగరం: సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులుగా ఎస్.సి.కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డి.వెంకటేశ్వరరావు అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత జిల్లా సాంఘిక సంక్షేమాధికారి బి.రామానందం పదోన్నతిపై అనకాపల్లి జిల్లా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇ.డి. వెంకటేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సాంఘిక సంక్షేమ డైరక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సోమవారం వెంకటేశ్వరరావు రామానందం నుంచి సాంఘిక సంక్షేమ డి.డి.గా బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్ర మాలల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ 5న జిల్లాకు రాక

రాష్ట్ర మాలల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డా.పెదపూడి విజయకుమార్ జూన్ 5న జిల్లాలో పర్యటించనున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తన పర్యటనలో భాగంగా ఆయా వర్గాలతో భేటీ అయి వారికి అమలు జరుగుతున్న పథకాలపై తెలుసుకుంటారని, జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సమావేశమై పథకాల అమలుపై చర్చిస్తారని పేర్కొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి





విశాలాంధ్ర – వేపాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాలకు నిరసనగా నియోజకవర్గ కేంద్రం శృంగవరపుకోటలో మాజీ ఎమ్మెల్యే కడపంది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన వేపాడ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు హామీలిచ్చి,వాటిని గాలికి వదిలేసి, చంద్రబాబు నాయుడు చేసిన మోసాలకు అరాచకాలకు అన్యాయాలకు నిరసనగా ఈ వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున మండలంలో ఉన్న 29గ్రామపంచాయతీలో గల పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకులు వేచలపు వెంకట చినరాము నాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు,జడ్పీటీసీ శానాపతి అప్పారావు, వైస్.ఎం పిపి అడపా ఈశ్వరరావు, అరిగిపాలేం ఎంపిటిసి తొండవరపు వెంకటరమణ, సోంపురం సర్పంచ్ మురిపిండి గంగరాజు,చామలాపల్లి సర్పంచ్ కోలా సతీష్,వైసీపీ నాయకులు దండుపాటి సత్తిబాబు,కోటం శెట్టి గణపతి, కిలపర్తి మురళి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: అధికారంలోకి వచ్చి ఏడాదైనా కూటమి నాయకులు ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చక పోవడాన్ని నిరసిస్తూ జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నామని రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే రాజేష్ అన్నారు. ఈ కార్యక్రమం జూన్ 4వ తేదీ ఉదయం 9గంటలకు పాలకొండ రోడ్‌లో గల సన్ రైజ్ హస్పిటల్ నుంచి వెన్నుపోటు ర్యాలీ ప్రారంభమై, అంబేద్కర్ కూడలికి చేరుకొని అక్కడ నుంచి శ్రీకాకుళం రోడ్‌లో గల తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్ళి తహసిల్దార్‌కి మెమొరాండం ఇవ్వడం జరుగుతుందన్నారు. ర్యాలీలో జిల్లా వైఎస్ఆర్సీపీ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, (చిన్న శ్రీను) మాజీ పార్లమెంటు సభ్యులు,రాష్ట్ర పిఎసి సభ్యులు బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారన్నారు.

బొబ్బిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయడంలో తీవ్రంగా విఫలం చెందిందని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీలు, అసెంబ్లీ కమిటీలు, మండల కమిటీలు, ఎంపీపీలు,వైస్ ఎంపిలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు,కౌన్సిలర్ల, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు,సోషల్ మీడియా మిత్రులు, గ్రామ స్థాయి నాయకులు నిరసన ర్యాలీల్లో కీలకంగా పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. బొబ్బిలి పట్టణంలో జూన్ 04 బుధవారం ఉదయం 9:00 గంటలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ ప్రారంభించి ఎస్బిఐ రోడ్డు నుంచి కృష్ణ టాకీస్ మీదుగా తాండ్ర పాపారాయుడు విగ్రహం పక్క నుంచి స్టైల్ బజార్ రోడ్డులో వెళ్లి అలా బొబ్బిలి బలిజిపేట మెయిన్ రోడ్డు మీదుగా తహసిల్దార్ కార్యాలయానికి చేరుకుని వైసీపీ శ్రేణులంతా తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.

యువతిని మోసగించిన కేసులో ఐటిఐ విద్యార్థి అరెస్ట్

విశాలాంధ్ర – రామభద్రపురం: ఇన్ స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతా క్రియేట్ చేసి యువతకి న్యూడ్ ఫోటోలు పెట్టి డబ్బులు డిమాండ్ చేసిన కేసులులో ఒక విద్యార్థిని మంగళవారం అరెస్టు చేశామని బొబ్బిలి డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారి భవ్య రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ప్రెస్ మీట్‌లో సందర్భంగా ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మెరకముడిదాం బుధ రాయివలస గ్రామానికి చెందిన ఒడిస్సాలో చదువుతున్న ఒక ఐటిఐ విద్యార్థి రామభద్రపురం మండల కేంద్రానికి చెందిన ఒక అమ్మాయిని ఇన్ స్టాగ్రామ్‌లో తప్పుడు ఖాతా సృష్టించి పరిచయం ఏర్పరచుకున్నాడు. ఇన్ స్టాగ్రామ్ ప్రొఫైల్లో అతని ఫోటోకు బదులు మరొక అమ్మాయి ఫోటో పెట్టి ఆ అమ్మాయికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించాడు. సోషల్ మీడియాలో ఆ అమ్మాయి స్పందించి రిప్లై పెట్టింది. ఆ విధంగా ఇద్దరి మధ్య కొంత పరిచయం ఏర్పడింది. దీనిని అదునుగా తీసుకొని ఆ విద్యార్థి ఒక 500 రూపాయలు పంపించమని మరల రిక్వెస్ట్ పెట్టాడు. నా దగ్గర అంత డబ్బులు లేవు అని ఆ అమ్మాయి రిప్లై పెట్టింది. మరోసారి 1000 ఇవ్వమని రిక్వెస్ట్ పెట్టాడు. ఆమె మరలా డబ్బులు లేవని తిరిగి రిప్లై పెట్టింది. కొత్తగా వచ్చిన అన్ డ్రస్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ సహకారంతో న్యూడ్ ఫోటో పెట్టి ఆమెను సోషల్ మీడియాలో బెదిరించాడు. ఆ యువతి కొన్ని రోజులు నరకాన్ని భరించి సైబర్ క్రైమ్‌లో 1930 కి ఫిర్యాదు చేసింది. గత నెల మే 2న ఆ యువకుడిపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. డీఎస్పీ భవ్య రెడ్డి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణరావులు నెల రోజులు దర్యాప్తు అనంతరం ఆ వ్యక్తిని మంగళవారం రామభద్రపురం పోలీస్ స్టేషన్లో అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు. న్యాయమూర్తి అతడికి 14రోజులు రిమాండ్ విధించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెలమల ప్రసాదు స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: జ్యేష్ఠ శుద్ధ దశమి గురువారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ నారాయణం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం దేవాలయం వద్ద ఆయన మాట్లాడుతూ 1890 సంవత్సరం లో నిర్మితమైన ఆలయం 135 సంవత్సరంలు పూర్తి చేసుకుంటుందన్నారు. 2007 సంవత్సరంలో ఆలయ పునః నిర్మాణం చేపట్టిన విషయం గుర్తు చేశారు. శ్రీ వాసవి మాతకు బంగారు చీర, వజ్రకిరీటం ఏర్పాటు, దేవాలయం మొత్తం శీతలీకరణం, అమ్మవారి చరిత్ర చిత్ర పఠంలను ఏర్పాటు చేయుట, ప్రతిరోజూ భక్తులకు అన్నదానం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలకు భక్తులు, దాతలు, పాలకమండలి సభ్యులు సహకారం ఎంతోవుందని అన్నారు. వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 5 గంటల నుండి ఆలయం ప్రధాన అర్చకులు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ గణపతిపూజ, పుణ్యాహవాచనం అమ్మవారికి పంచామృతాభిషేకం, వజ్రకిరీట స్వర్ణకవచ అలంకరణలో అమ్మవారి దర్శనం కుంకుమా ర్చనలు, వాసవీమూలమంత్రహోమం, పూర్ణాహుతి, గోపురోత్సవం, నీరాజన మంత్ర పుష్పములు సాయంత్రం 6 గంటలకు నుండి (తిరువీధి)ఉత్సవం తదుపరి పంచహారతులు, పవళింపుసేవ జరుగు నని చెప్పారు. భక్తులందరూ ఆలయ వార్షికోత్సవములలో పాల్గొని అమ్మవారి కరుణాకటాక్షములు పొందవలసినదిగా శ్రీనివాస్ కోరారు.



ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ బబిత

విశాలాంధ్ర – బొబ్బిలి : జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ న్యూఢిల్లీ వారి యొక్క ఉత్తర్వులు మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ, చైర్మన్ ఎం బబిత బొబ్బిలి సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు పలు చట్టాల పై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ గూర్చి తెలియజేశారు. ఆ విధంగా ఖైదీలు పట్ల వివక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని, ఆ విషయమై జైలు సూపరింటెండెంట్ గారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు మరియు జైల్ క్లినిక్లను సందర్శించే న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. జైలులో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయ సహాయము అందించడానికి జైల్ లీగల్ ఎయిర్ క్లినిక్లను ఎర్పాటు చేశామనివాటిని సక్రమంగా కొనసాగించాలని తెలియజేశారు. జైల్లో ఉచిత న్యాయ సహాయం ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయము అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యం అని తెలియజేశారు. రిమాండ్లో ఉన్న ముద్దాయిలకు ఎవరు న్యాయవాది లేకుండా ఉన్నవారు ఎవరైనా ఉన్నారా....? అని అడిగి తెలుసుకొని, అట్టివారికి బొబ్బిలి మండల న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం న్యాయవాదిని అందిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. జైలులో అమలవుతున్న తాగునీరు విద్యుత్ పారిశుధ్య పౌష్టిక ఆహారం సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు, వంటగదిని మరియు స్టోర్ రూమ్ ను పరిశీలించి నిత్యవసర వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

నేడు కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సంబరాలు

విశాలాంధ్ర –సబ్బవరం: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ల సారధ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలందరు విజయోత్సవ వేడుకలు జరుపుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నిర్ణయించడం జరిగిందని మండల జనసేన నేతలు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ నెల 4 న బుధవారం మండల కేంద్రంలోని స్థానిక రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురుగా ఉన్న సాయి నగర్ 50 అడుగుల రోడ్డు లో ఉదయం 7 గంటల నుండి సంక్రాంతి పండుగ తరహాలో సుపరిపాలనకు ఏడాది పేరుతో సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించబడునని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలతో పాటు పాల్గొన్న మహిళలు అందరికీ కూడా ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. అలాగే సాయంత్రం 6 గంటల నుండి దీపావళి పర్వదినం మాదిరి స్థానిక ఎన్టీఆర్ కూడలిలో దీపాలు వెలిగించి భారీ మందుగుండు సామాగ్రి కాల్చబడునని తెలిపారు.కావున ఈ రాష్ట్రానికి దక్కిన మహర్దశకు ప్రతీకగా ఈ యొక్క కార్యక్రమంలో ప్రజలందరూ మరియు సబ్బవరం మండల స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ఎన్డీఏ మహా కూటమి నేతలు మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.